ప్రచురణకు స్వీకరించిన పోటీ కథ :

# వారసత్వం

రామనాధ బాబుగారు ఉలిక్కిపడి లేచారు. ఏదో పీడకల. మళ్ళీ మననం చేసుకొనే లోపలే గుర్తులేకుండా పోయింది. ఆయన గుండె మాత్రం చాలా వేగంగా కొట్టుకుంటోంది. సాయంత్రపు ఎండ కిటికీలోంచి ఆయనమీద పడుతోంది. గడియారం వంక చూశాడాయన. అయిదున్నర అవుతోంది. వీధంతా పిల్లల కేరింతలతో కోలాహలంగా వుంది. బయటికొచ్చి వాళ్ళ ఆటలు చూస్తూ అరుగుమీద కూలబడ్డాడాయన దుఃఖమనేది తెలియని వయసు. పిల్లలందరి మొహాల్లోనూ ఆనందం తాండవిస్తోంది. నిజంగా మానవుడికి జీవితంలో బాల్యదశయందున్న ఆనందం, అమాయకత్వం మరొకప్పుడు వుండవేమో అనిపించిందాయనకి తన బాల్యం గుర్తుకొచ్చింది

సరిగ్గా ఆ పిల్లలు ఆడుకొనే కుంకుడు చెట్టు దగ్గరే తనూ ఆడుకొనేవాడు. రామూ శేషూ, రాఘవా- ఆటల్లో రాఘవ ఎప్పుడూ దొంగే ప్రస్తుతం సర్కిల్ ఇనిస్పెక్టరు చేసి రిటైర్ అయ్యాడు. శేషు తాలూకాఫీసులో గుమాస్తాచేసి రిటైర్ అయ్యాడు. రాము ఎక్కడికిపోయాడో, ఏమి చేస్తున్నాడో ఎవ్వరికీ తెలియదు. రాఘవ అప్పుడప్పుడూ ఉత్తరాలు వ్రాస్తూంటాడు. ప్రతి ఉత్తరంలోనూ తనని రమ్మని వ్రాస్తూంటాడు. తన దగ్గర వుండిపొమ్మంటాడు. కాని తను వెళ్ళడం ఏమంత భావ్యంగా వుండదు. వాడే తన కొడుకు దగ్గర వుంటున్నాడు. ఎలాగైనా వాడే అదృష్టవంతుడు. ఒక్క కొడుకుని కన్నాడు. వాణ్ణి డాక్టరు చేశాడు. క్రిందటి సంవత్సరమే వాడికి పెళ్ళికూడా చేశాడు. "కృష్ణా! రామా!" అనుకొంటూ హాయిగా కొడుకూ, కోడళ్ళదగ్గర కాలం గడిపేస్తున్నాడు. అంతకంటె కావల్సిందిమాత్రం ఏముంది?

తనకీ ముగ్గురు కొడుకులు వున్నారు. కొడుకుల సంగతి గుర్తురాగానే ఆయన కళ్ళు చెమ్మగిలినయి. ముగ్గుర్ని తల్లి చనిపోయిన లోపం లేకుండా పెంచాడు పెద్దవాణ్ణి ఇంజనీరుగా చేశాడు. రెండో వాణ్ణి డాక్టరు చెయ్యాలనుకొన్నాడు. కాని

రచన :

యర్రంశెట్టి శాయి

వాడు తన మాట వినకుండా ప్లీడరు చదివాడు. మూడో వాడు చిన్నప్పటినుంచీ అల్లరిగా తిరిగి పదేళ్ళ క్రిందట మిలటరీలో చేరి పోయాడు.

పెద్దకొడుకు దగ్గర కొన్నాళ్ళు వున్నాడు తను. కోడలికి ఎందుకనో తనంటే సరిపడేదికాదు. పిల్లలమీద పెట్టి ఏదో ఒకసూటి పోటీమాట లంటూండేది ఇది విన్నా ఏమీ మాట్లాడేవాడు కాదు పెద్దవాడు. తనంటే వాళ్ళ కిష్టంలేదని తెలిసిపోయింది. రెండో కొడుకు దగ్గరికి చేరుకొన్నాడు తనని చూసి వాడు తన పుట్టి అంతా మునిగిపోయినట్లు అక్కడున్న నాలుగు రోజులూ తనని పలుకరించనే లేదు. ఒక రోజున తను బయటకూర్చుని పేపరు చదువు కొంటూంటే వచ్చి తనతో అన్నాడు.

"అన్నయ్య దగ్గర కొన్నాళ్ళుండక పోయావు నాన్నా!" అని.

తనకి పట్టరాని కోపం వచ్చింది వాడిమీద. ఏమనలేక వెంటనే బయలేరాడు తను. తన చిన్ననాటి స్వగ్రామానికి. ఇల్లు పాడుబడి వుంది. చక్కగా బాగు చేయించుకొన్నాడు. ఒక వంటవాణ్ణి ఏర్పాటు చేసుకొని హాయిగా వుంటున్నాడు. రెండు సంవత్సరాలు పూర్తవుతున్నాయి. అన్ని విధాలా గ్రామీణ వాతావరణం చాలా సరిపడింది తనకు. రోజులు హాయిగా గడచిపోతున్నయి. కాని వంటరితనం. చాలా దుర్భరం అవుతోంది తనకు. మనసులో చిన్ననాటి సంగతులు మెదిలి మనస్సెప్పుడూ వికల మౌతూంటుంది. తనంటే ఆ వూరి వాళ్ళందరికీ భయం. గౌరవం. కాని అది తనని చూసి కాదు. తన ఆస్థిని చూసి.

వెంకట్రామయ్య ఒక్కడికే తనంటే ప్రేమ. తన సంగతులన్నీ అతనికి తెలుసు. తనకీ వెంకట్రామయ్యంటే అభిమానం. చాలాకాలం నుంచీ ఆ వూళ్ళోవున్న తన పొలం వెంకట్రామయ్య కౌలుకి చేస్తున్నాడు. వెంకట్రామయ్య చాలా బీదవాడు. దానికితోడు నలుగురు ఆడపిల్లలు అతనికి, పెద్దమ్మాయి పెళ్ళీడు కొచ్చింది. ఆ అమ్మాయి పేరు లలిత, చాలా మంచి పిల్ల. ఒక రోజు తనకి విపరీతంగా గుండెనొప్పి వచ్చింది. వెంకట్రామయ్య లలితని తన దగ్గరుంచి తను సైకిలుమీద పట్నంవెళ్ళి డాక్టరుని తీసుకొచ్చాడు. ఆ రెండు రోజులూ కంటిమీద కునుకు లేకుండా తన దగ్గరుండి, వేళకి మందు ఇస్తూ చెప్పరాని సేవ చేసింది. తరువాత అడిగాడు తను.

"లలితా! నేనంటే ఇంత అభిమానం ఎందుకమ్మా నీకు?" అని.

"ఈవృద్ధాప్యంలో ఒంటరిగా వుంటున్న మీకు కష్టంలో సాయం జేయాలని ఎవరి కనిపించందే!" అంది లలిత. ఆ జవాబు వింటూంటే తనకు చాలా సంతోషం కలిగింది. లలితకు చక్కటి జీవితం ప్రసాదించమని భగవంతుడిని ప్రార్థించాడు తను. తన యింటి నానుకొనే వెంక

ట్రామయ్య ఇల్లు. ప్రతిరోజూ సాయంత్రం తనకి పాలు స్వయంగా కాచి తెచ్చిస్తూంటుంది లలిత. లలితని చూసినప్పుడప్పుల్లా లలితలాంటి కూతురు తనకీ వుంటే.... అనిపించేది.

"బాబుగారు ! ఏదో ఉత్తరం వచ్చిందండీ మీకు ! మధ్యాహ్నమే పోస్టుమాన్ ఇచ్చాడు నాకు మీకివ్వమని!" వెంకట్రామయ్య ఉత్తరం అందించాడు. మూడో కొడుకునుంచి వచ్చిన ఉత్తరంఅది. మరో నెలరోజుల్లో మిలటరీనుంచి వచ్చేస్తున్నానని వ్రాశాడు. అప్పటికి బాండులో వ్రాసిన కాలం పూర్తవుతుందట. వెంకట్రామయ్య ఆతృతగా అడిగాడు. "ఎక్కడి నుండి బాబూ ఉత్తరం !"

"మా మూడో అబ్బాయి దగ్గరనుంచి వచ్చిందోయ్ ! మరో నెల రోజుల్లో వాడిక్కడికి వచ్చేస్తున్నాట్ట ! తిరిగి మిలటరీలోకి వెళ్ళడు !"

"అలాగాండి ! చాలా సంతోషంగా వుంది. చిన్నబ్బాయిగార్ని నేనసలు చూడనే లేదండి !"

"ఇహను ఇక్కడే వుంటాడు గదుటోయ్ ! అవునుగానీ- వెంకట్రామయ్యా వాడికి రాగానే ఒక మాంచి అమ్మాయిని చూసి పెళ్ళిచేసెయ్యాలోయ్ ! ఆ అమ్మాయి మా పెద్ద కోడళ్ళిద్దరిలా వుంటానికి వీలు లేదు ! కదూ ?"

"అవునండీ !" అన్నాడు వెంకట్రామయ్య బుర్రగోక్కుంటూ.

కాసేపు కూర్చుని "వస్తానండీ"అంటూ తన యింటికి వెళ్ళిపోయాడు.

రామనాథ బాబుగారికి చాలా సంతోషంగా వుంది. తన కొడుకు వస్తున్నాడు. వీడు పెద్ద వాళ్ళిద్దరిలా వుండడు. తనంటే ప్రేమగా వుంటాడు. వాడికి వివాహం జెయ్యాలి. ఒక బీదింటి అమ్మాయి తన కోడలవ్వాలి. అటువంటి అమ్మాయికి తన ఇద్దరి పెద్ద కోడళ్ళలా డబ్బువల్ల వచ్చే అహంకారం వుండదు. పైపెచ్చు, ఆదరణ, అభిమానం అంటే వారికి బాగా తెలుసు. తప్పక అటువంటి అమ్మాయితోనే వాడి వివాహం జరిపించాలి. వాడి కడుపునో కాయి కాస్తే....

రామనాథబాబుగారు చాలా సంతోషపడిపోయారు.

తనకి వంటరితనం తొలిగిపోతుంది. ఇంట్లో కొడుకూ కోడలూ కలకలలాడుతూ తిరుగుతూ వుంటే మనవడితో కాలక్షేపం జేస్తూ "కృష్ణా ! రామా !" అనుకొంటూ తన జీవితశేషం గడిపేస్తాడు.

వంటవాడు దీపం వెలిగించాడు.

పిల్లలందరూ ఆటలు ఆపి ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. క్షణంలో అంతా నిశ్శబ్దమైపోయింది. చలిగాలి రివ్వున వీయటం మొదలుబెట్టింది. లోపలకు వెడదామని అరుగు దిగాడు. చాలా ఆయాసం వచ్చిందాయనికి.

"అరె ! అరుగు దిగేసరికే ఆయసం వచ్చేసిందే ?" అనుకున్నాడు లోలోపల.

వెంటనే ముప్ఫై ఏళ్ళనాటి సంగతి ఆయన కళ్ళముందు మెదిలింది.

ఆ రోజు....

మంగళగిరి పానకాలస్వామి గుడిమెట్లు ఎక్కుతున్నారు తనూ, తన భార్య సుగుణ. మెట్లు ఎక్కలేక కొంతదూరం ఎక్కి అక్కడ ఆయాసపడుతూ నుంచుండిపోయింది సుగుణ. అప్పుడు తను నవ్వుతూ "ఈ వయసులోనే ఇంత ఆయాసంతో నీరసంగావుంటే, ముసలిదానివయ్యాక నువ్వు నడవనుకూడా నడవలేవేమో !" అన్నాడు.

"ఆ స్థితి వచ్చేవరకూ నేను ఈ భూమి మీద వుండాలని కోరుకోవడం లేదండి !" అంది సుగుణ. అన్నట్టుగానే ఆ తరువాత కొద్ది సంవత్సరాల్లోనే చనిపోయింది. తను ఇంకా ఎందుకనో అలాగే వున్నాడు. అప్రయత్నంగా ఆయన కళ్ళు చెమ్మగిల్లినయి.

అవును.... సుగుణ చనిపోవడమే మంచిదయింది. లేకపోతే తనలాగానే కొడుకులను కోడళ్ళను తలుచుకొని ఎంత కుమిలిపోయేదో ! "భగవంతుడా ! నన్నూ త్వరలో సుగుణ దగ్గర చేర్చు ! రామనాథ బాబుగారు ఇంట్లోకి నడిచారు. ఎదురుగానున్న లాంతరు వెలుగులో అద్దంలోని తన ప్రతిబింబం వింతగా కనబడిందాయనకు. అద్దం వెంటనే చేతిలోకి తీసుకొని దీపం ముందుకొచ్చి తన రూపాన్ని పరీక్షగా చూశాడు. జుట్టంతా పూర్తిగా నెరసిపోయింది. తను అద్దం చూసుకొని చాలా కాలం అయింది. ముఖంలో ముడుతలు స్పష్టంగా ఏర్పడినయి. కళ్ళల్లో కాంతి తగ్గిపోయింది. భుజం కొద్దిగా ముందుకి వంగినట్లనిపించింది. నిజమే ! తనకి యాభై ఎనిమిదేళ్ళు నిండుతున్నై. ముసలివాడు కాక పడుచువాడవుతాడా ?

"అట్లయితే నేనూ ఇంకెంతో కాలం వుండను." అనుకొన్నాడాయన. ప్రక్కనున్న పడక కుర్చీలో కూలబడ్డాడు. వంటింటినుంచి వంటవాడు ఏదో తిరగమూత పెట్టినట్లు గుప్పున వాసన తగిలింది. తీగకి తగిలించిన లాంతరు దగ్గరికి పురుగులు కొన్ని చేరుకొన్నయి.

రామనాథ బాబుగారి మనసు మళ్ళీ ఆలోచనలోకి దూసుకుపోయింది. తన జీవితం ఇంచుమించుగా ముగిసినట్లే కాని తను.... తన యాభై ఎనిమిదేళ్ళ జీవితంలోనూ సాధించినదేమిటి ? ఏమీలేదు.... ఏదో వ్యాపారం చేశాడు. ధనం సంపాదించాడు. అందరిలాగానే పెళ్ళిచేసుకొన్నాడు. పిల్లల్ని కని పెంచాడు. పెద్ద వాళ్ళని చేశాడు. అంతే ! బోలెడాస్థి వుంది. ఏం లాభం ? సుఖంలేదు. ఇహను తను చెయ్యాల్సింది ఒక్కటే ! తన ఆస్థిని సద్వినియోగం చెయ్యాలి. అదే తన కోరిక. కాని ఎట్లా ?

"బాబుగారూ ! భోజనం వడ్డించమంటారా ?" వంటవాడు ప్రశ్నతో తిరిగి ఈ లోకంలోకి వచ్చాడాయన.

(తరువాయి 16 వ పేజీలో)

## వారసత్వం

(10 వ పేజీ తరువాయి)

"నా కాకలికావటం లేదోయ్! మరో అరగం టాగి భోజనం చేస్తాలే! నువ్వింటి కెళ్ళిపో!"

వంటవాడు బయటకు నడిచాడు. తిరిగి నిశ్శబ్దం అలుముకొంది.

ఉన్నట్లుండి విపరీతమయిన గుండె నొప్పి వచ్చిందాయనకి. వెంటనే కుర్చీ లోంచి లేచి బాధతో మంచంమీద కూలబడ్డాడు.

"మరోసారి ఇలా నొప్పివస్తే వెంటనే నాకు కబురు చేయండి! లేకపోతే చాలా ప్రమాదం!"

డాక్టరు అన్నమాటలు గుర్తుకొచ్చినయి ఆయనకు. అంత నొప్పిలోనూ కొద్దిగా నవ్వు వచ్చింది. ఇలా ఎన్నిసార్లు, ఎంత కాలం డాక్టరు తనని బ్రతికిస్తాడోనని.

ఉండుండి పెద అలల్లాగా వస్తోంది నొప్పి. తట్టుకోలేకపోతున్నాడు.

"పెదనాన్నా! పాలుత్రాగ...." అంటూ లోపలికి వచ్చిన లలిత ఆయన గిలగిల బాధతో కొట్టుకోవడం చూచి ఖంగారుపడి తండ్రిని కేకేసింది.

వెంకట్రామయ్య పరుగెత్తుకొచ్చాడు. ఆయినపడే అవస్థచూసి నివ్వెఱపోయాడు. మాట్లాడలేక మాట్లాడుతున్నాడు రామనాధ బాబు.

"....మా అబ్బాయిలకి టెలిగ్రాం.... తొందరగా.... వెళ్ళు!"

"అమ్మాయి! బాబుగారిని కనిపెట్టుకుని వుండు! నేను డాక్టరుగారిని తీసుకొస్తా!" తొందరగా బయటికి నడిచాడు వెంకట్రామయ్య.

ఆయన అవస్థ చూస్తుంటే లలితకేమీ తోచడంలేదు. ఆయన మంచందగ్గిరలో కూర్చుని కళ్ళవెంబడి నీరు తుడుచుకొం టోంది. అరగంట గడిచేసరికల్లా బయట కారు ఆగిన చప్పుడయింది. డాక్టరు లోపలి కొచ్చాడు. ఏదో ఇంజక్షన్ చేశాడు ఆయనకు. అప్పుడు కొద్దిగా తేలిగ్గా ఫీలయ్యాడు రామనాధ బాబుగారు.

కళ్ళువిప్పి డాక్టరువంక కృతజ్ఞతాసూచకంగా చూశాడు. డాక్టరు వెనుక ఆతృతగా తనవంక చూస్తున్న లలిత ఆయన కన్పడింది.

"చూడమ్మా! ఇహను ఈయనకేం ఫరవాలేదు! ఈ మందు అరగంట అరగంటకీ ఒక మోతాదు పేస్తూండు ఈ మాత్రలు కూడా! నేను మళ్ళీ తెల్లారి వస్తాను!"

గాజుగ్లాసులో మందు అందించింది లలిత. ఆయన కళ్ళు అవ్యక్తానందంతో మిలమిల లాడినయి. ఏదో మాట్లాడాలని ప్రయత్నించాడు.

"ఇప్పుడేం మాట్లాడవద్దు పెదనాన్నా! మీకు విశ్రాంతి అవసరం!"

మందుత్రాగి ప్రక్కకు తిరిగి పడు కొన్నాడు. గుండెనొప్పి పూర్తిగా పోలేదు గాని చాలావరకు తగ్గిపోయింది. కొద్దిగా మగతగా నిద్రపట్టిందాయనకి. అరగంట అవగానే మందు అందిస్తోంది లలిత.

షుమారు రాత్రి రెండుగంటలకు దిగారు పెద్దకొడుకూ కోడలూ, అప్పటి కింకా రామనాధబాబు మెలుకువతోనే వున్నారు.

"నాన్నా!" అంటూ కళ్ళవెంబడి నీళ్ళు పెట్టుకొన్నాడు కొడుకు.

"మావయ్యా! ఈస్థితిలోవుండి మాకు వుత్తరంకూడా వ్రాయలేదే?" బొటబొటా కన్నీరు కార్చింది కోడలు.

"ఏమైనాసరే! తగ్గగానే నువ్వు నాదగ్గరి కొచ్చెయ్ నాన్నా! ఇహను ఇంచీ నువ్వు ఇక్కడ వుండటానికి వీలులేదు." నిశ్చయంతో అన్నాడు కొడుకు.

ఆయన మనస్సు ఆనందంతో నిండిపోయింది. తన కొడుకూ, తన కోడలు. ఇద్దరికీ మనసులో తనంటే ప్రేమ! పైకి మాత్రం మామూలుగా కనిపిస్తారు తను వాళ్ళని తప్పుగా అర్ధంచేసుకొన్నాడేమో! తనే స్వయంగా మందు త్రాగిస్తోంది కోడలు.

మరో అర గంట గడిచేసరికి రెండో కొడుకూ, కోడలూ టాక్సీ దిగారు. "నాన్నా!" అంటూ పరుగెత్తుకొచ్చాడు లోపలికి. కోడలు తనని చూసి మౌనంగా విలపించడం గమనించాడాయన. ఇద్దరినీ దగ్గరకు పిలచి "ఫర్వాలేదు! డాక్టరువచ్చి వెళ్ళాడు! నా కిప్పుడు బాగానేవుంది." అన్నాడు తన కోసం నలుగురూ విచారించడం చూచేసరికి వారిమీద అదివరకున్న దురభిప్రాయం తొలగిపోయిందాయనకి తనంటే ఎంత ప్రేమ లేకపోతే టెలిగ్రాం ఇవ్వగానే వస్తారూ?

"పిల్లల్ని తీసుకు రాలేదేంరా?" ఇద్దరి కొడుకుల వంక చూస్తూ ప్రశ్నించాడాయన.

"వాళ్ళు నిదురలో వున్నారు. అదీగాక ఇక్కడ వాళ్ళ దొక గొడ వెందుకులే అని పూరు కొన్నాము. అయాకి అప్పజెప్పి వచ్చేశాము"

"చంటి వాళ్ళనన్నా తీసుకొస్తే బాగుం డేది!" అనుకొన్నాడాయన.

మరి కొద్దినిముషాల్లోనే గాఢంగా నిద్ర పట్టేసిందాయనకి. ఎప్పుడో అర్ధరాత్రి తిరిగి హటాత్తుగా మెలకువ వచ్చింది. తన మంచం దగ్గర ఎవ్వరూ కనిపించ లేదు. ప్రక్క గదిలోంచి ఏదో మాటలూ వినబడుతున్నయ్.

"ఒరేయ్! తమ్ముడూ! నాన్నను ముందుగా కొన్నాళ్ళు నీ దగ్గరుంచుకో! తరువాత నేను తీసుకెళ్తాను పెదకొడుకు గొంతు.

"వద్దురా అన్నాయ్! నేనూ, భాగ్యలక్ష్మి వచ్చేవారంలో కాశ్మీర్ వెళ్ళాలనుకొంటున్నాం! ఈ ముసలాడిని ఎవరు చూస్తారు?" రెండో కొడుకు.

(తరువాయి 25 వ పేజీలో)

## వారసత్వం

(16 వ పేజీ తరువాయి)

"అదేరా! నాకూ ఏమీ తోచడంలేదు. మీ వదినేమో" ఏమైనా సరే ఆయనకి చాకిరీ చెయ్యడం నా వల్లకాదు అంటోంది."

"అవునండీ! ఈ ముసలాడిక్కడే వుంటే ఏం?" పెద్దకోడలు ప్రశ్నించింది.

రామనాధ బాబుగారికి మతిపోయినట్ల యింది. జాగ్రత్తగా వాళ్ళ మాటలు వినసాగాడు.

"తమ్ముడూ! ఇది విన్నావా? తన మూడో కొడుక్కికూడా తెలిగ్రాం ఇచ్చాడట! ఆ వెధవ రేపో, ఎల్లుండో వచ్చి, నాన్నదగ్గర బైఠాయించి, కల్లి బొల్లి కబుర్లాడి, ఆస్తంతా తన పేర రాయించు కొని "టింగు రంగా" అంటూ ఎగిరి పోతాడు. అప్పుడు నువ్వూ నేనూ ఏడుస్తూ కూచోవాలి!"

"అందుకు నన్నేం చెయ్యమంటావ్?" విసుగ్గా అడిగాడు.

"ఏమీలేదు! ఈ ముసలివాడెక్కువ రోజులు బ్రతకడు. ఉన్న నాలుగురోజులూ మన దగ్గరవుంటే, ఆస్తి మనచెయ్యి దాటి పోదు."

"ఎప్పుడో పోతాడని ఇప్పటినుంచే ఎవడు చాకిరీ చేస్తాడు? నా వల్లకాదు బాబూ" రెండో కోడలు.

'ఒరేయ్ అన్నాయ్! ఒక పని చేద్దామా'

"ఏమిటదీ?"

"ప్లీడరు ఇక్కడ వున్నాడుగా! తీసుకొచ్చి ఇప్పుడే ఆస్తి వీలునామా! వ్రాయించేస్తే!

"ఆల్ రైట్! నేను వెళ్ళి పిలుచుకొస్తా!" పెద్దకొడుకు గదిలోంచి బయటకి వెళ్ళడం కనిపించిందాయనకి. కోపంతో ఆయన మొఖం జేవురించింది. మనసంతా వికలమయిపోయింది. "కపట ప్రేమ! దుర్మార్గులు. నా కొడుకులుకాదు వాళ్ళు! రాక్షసులు! వాళ్ళకొచ్చేవల్సింది నేనుకాదు. నా ఆస్తి!" ఆయనకి ఉద్రేకం వచ్చేసింది.

గుండెలు పిండేస్తున్నట్లు నొప్పి 'అబ్బా' గట్టిగా మూలిగారాయన. రెండో కొడుకూ, కోడలూ, పరుగెత్తుకొచ్చారు. తలాకిట్లోంచి ప్లీడరూ, పెద్ద కొడుకూ వచ్చి మంచం దగ్గర నిలబడ్డారు.

'మీరంతా కాసేపు బయట నుంచోండి' ప్లీడరు అన్నాడు. అందరూ బయటకు నడిచారు.

"విశ్వనాధంగారూ.... నా ఆస్తి అంతా లలితకి.... వెంకట్రామయ్యకూతురు.... పేర....వ్రా....యండి! లలితే నా నిజమైన వారసురాలు! ఈ...." మాట్లాడలేక ఆగిపోయాడాయన. ప్లీడరు తొందరగా వ్రాసి కాయితం ఆయన కందించాడు. కాయితం తీసుకొని సంతృప్తిగా సంతకం పెట్టాడాయన.

> **నీ బలమే**
> **నీ జాతి బలం**

ఉధృతంగా విజృంభించింది నొప్పి బాధతో గట్టిగా అరచారాయన. ఆ తరువాత హాయిగా కళ్ళుమూసుకొన్నారాయన.

* * *

ఆ తరువాత తమ ఇద్దరి పేర వున్న ఆస్తి వీలునామాను అయిదు వేలు ప్లీడరుకిచ్చి తీసుకొని వెళ్ళిపోయారు ఇద్దరు కొడుకులూ. ఈసంగతి పరలోకంలోవున్న రామనాధ బాబుగారికేం తెలుస్తుంది గనుక?

---

## ఎడారి పువ్వులు

(22 వ పేజీ తరువాయి)

మధు ఆశ్చర్యపోయాడు.

"వాడు! రామనాధం విషయం నీకు తెలియదు.... నువ్వు రేపటి నుంచి వాళ్ళ బ్బాయికి చదువు చెప్పు!"

మధు అతనివైపు మౌనంగా చూస్తూ వుండి పోయాడు.

"ఏమిటోయ్ అలా చూస్తావు? వాడికే కాదు - యింకా ఎవరికైనా చెప్పు....డబ్బు నేనిస్తాలే .... ఆఁ .... నువ్వేం చదువుకున్నావు?"

"బి. ఏ. నండి!"

"అదేమిటోయ్! బి. ఏ. చదివి.... వంతులు పనికొచ్చావు? .... అయినా యిక్కడ నీకు హాయిగానే వుందిగా.... పడుకో!" అంటు వెళ్ళిపోయాడు.

మధుకు నవ్వాలో, ఏడ్వాలో అర్థం కాలేదు.

రామనాధాన్ని....శేషయ్యను....యిద్దర్నీ పోల్చి చూసుకున్నాడు. యిందులో ఎవరూ విరోధులు కారు....యిద్దరు స్నేహితులే....! వారి మాటల పద్ధతి అతనికి నవ్వు తెప్పించింది....

అలా నవ్వుకుంటున్నప్పుడు అతనికి రాధ జ్ఞాపకానికొచ్చింది.... లేచి బైటి కొచ్చాడు...

చిమ్మ చీకటి -

గన్నేరుచెట్టుదాకావచ్చి పైకి చూశాడు..

రాధ గదిలో దీపం వెలుగుతుంది.... దాని పలచటికాంతి కిటికీ ఊచల దాకా వచ్చి ఆగిపోయింది.

మధు తిరిగివచ్చి గదితలుపులు వేసుకున్నాడు.

-సశేషం

---

## భారత దేశంలో భూస్వామ్యాధి పత్యం ఎవరిది?

(15వ పేజీ తరువాయి)

మరొక సమస్య ప్రారంభమయింది. భూస్వామికి, వ్యవసాయంచేసే వానికి గల సంబంధాలు అవాంఛనీయంగా తయారైనవి. దీనికే రాష్ట్ర ప్రభుత్వాలన్నీ కాలానుగుణ్యంగా పరిస్థితుల దృష్ట్యా సమగ్రమయిన కౌలుదారి చట్టాన్నిరూపొందించి రైతు స్థితిని మెరుగుపరిచాయి. ఏది యెట్లయినా భూమ్యాధిపత్యం ఎవరిదయినా ప్రస్తుత ఆత్యయిక పరిస్థితుల దృష్ట్యా రైతులు, భూస్వాములు అవసరమైతే తమకు సర్వాధిపత్యంగల భూములలోని పంటను దేశరక్షణ దృష్టితో ఉదారంగా ఇస్తారని ఆశిద్దాం.